

ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.50 లక్షలు విరాళం



ప్రజాశక్తి - తిరుపతి డెస్క్ : చెన్నైకి చెందిన పౌన్ ప్యూర్ కెమికల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వారు ఆదివారం శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.50 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు తిరుమలలోని టీటీడీ అదనపు ఈవో కార్యాలయంలో అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి ఆ సంస్థ సీఎండీ ఎం.పొన్నుస్వామి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.పి.సూర్యప్రకాశ్ విరాళం చెక్కును అందజేశారు. ఈ విరాళాన్ని శ్రీ వెంకటేశ్వర ప్రాణదాన ట్రస్టులో భాగమైన శ్రీవేంకటేశ్వర అపన్న హృదయ పథకానికి వినియోగించాలని దాత అదనపు ఈవోను కోరారు.

ప్రజా అవసరాలను విస్మరించి..

పెత్తనం కోసం ఒప్పందాలు వద్దు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: అమెరికా ఆర్థిక పుష్టి కోసం, ప్రపంచ దేశాలపై పెత్తనం కోసం ట్రంప్ నిర్ణయాలను అంగీకరిస్తే భారతదేశానికి మరణ శాసనం రాసుకున్నట్లేనని, ఏ దేశ ప్రభుత్వాలు కానీ ఆ దేశ ప్రజల అవసరాల కోసం ఇతర దేశాలతో ఒప్పందాలు చేసుకుంటారే తప్ప, ఆ దేశంపై పెత్తనం ఇచ్చేందుకు కాదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలను పురష్కరించుకుని సిపిఎం తిరుపతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'ట్రంప్ దూకుడు- భారత్‌పై ప్రభావం' అనే అంశంపై ఆదివారం సదస్సు నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అధ్యక్షతన యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగిన సదస్సుకు వి.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికాలో ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ దేశంలోని ధనవంతులకు మరింత మేలు చేకూరేందుకు రకరకరకాల నిర్ణయాలు తీసుకున్నారు. అందులో విదేశీ ఎగుమతులు, దిగుమతలపై సుంకాల పెంపు నిర్ణయం ఒకటి అన్నారు. ఈ విధానం వల్ల భారత ఆర్థిక రంగంపై తీవ్రప్రభావం చూపుతుందన్నారు. దైవపాక్షి ఒప్పందం పేరుతో ఇరుదేశాలకు సంబంధించి సుంకాల్లో ఎగుమతులు, దిగుమతులు 10శాతం ఉంటుందని చెప్పుతున్నా, పది శాతం డాలర్‌కు, పది శాతం రూపాయికి చాలా వ్యత్యాసం ఉంటుందన్నారు. పైగా మన ఉత్పత్తులు పెద్దగా వారికి వినియోగం లేకపోయిన, అమెరికా నుంచి వచ్చే పాల ఉత్పత్తులు అందకపోతే దేశా సహకార రంగం డీలాపడిపోతుందని గుర్తు చేశారు. నీటిని వ్యాపారీకరణంగా చూడడం చాలా ప్రమాదకరమని దీని వల్ల వ్యవసాయరంగం కుదేళ్ల అవుతుందన్నారు. గత ఐదారు సంవత్సరాలు తర్వాత వ్యవసాయ సంక్షోభం తీవ్రతరం అవుతోందన్నారు. మహారాష్ట్రలో రైతుల ఆత్మహత్యలు మళ్లీ మొదలయ్యాయని గుర్తు చేశారు. ఇలాంటి తరుణంలో అమెరికా సుంకాల ఒప్పందం మరింత ప్రమాదకరమన్నారు. వాస్తవానికి భారత్‌పై పెత్తనం చలాయించేందుకు ట్రంప్ చూస్తున్నారని, అందులో భాగంగా మోదీతో మంతనాలు జరిపేందుకే ఆ దేశ ఉపాధ్యక్షులు వాన్స్ భారత్‌లో పర్యటించి, మోదీతో మంతనాలు జరిపారన్నారు. వాస్తవానికి ఎగుమతులు, దిగుమతలు విషయంలో రష్యా, భారత్‌కు తక్కువ ధరకు సుఖాయి యుద్ధ విమానాలను సరఫరా చేస్తామంటున్నా వాటిని కొనుగోలు చేయకూడదని అమెరికా భారత్‌ను ఆదేశిస్తున్నారని, ఇరాన్, రష్యా నుంచి తక్కువ ధరకు పెట్రోల్ డీజల్, గ్యాస్ సరఫరా చేస్తామంటే దాన్ని కాదని అధిక ధరలకు అమెరికా వద్ద కొనుగోలు చేయడం శోచనీయమన్నారు. పైగా రష్యా రూపాయితోనే విక్రయాలు చేస్తానంటుందని, ఈ విధానం వల్ల అదే రూపాయిని వారు వినియోగించాలంటే తప్పనిసరి పరిస్థితుల్లో భారత్ ఉత్పత్తులనే కొనాల్సి ఉంటుందని, డాలర్ చెల్లింపులైతే ఉత్పత్తులు వారికి నచ్చిన చోట కొనుగోలు చేయవచ్చని, రష్యా హామీ భారత్‌కు రెండు వైపుల మేలు చేస్తుందన్నారు. అయినా దాన్ని వద్దనడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రపంచ దేశాలపై పెత్తనం కోసమే ట్రంప్ సుంకాలు పెంచారని, దీనికి చైనా దీటుగా స్పందిస్తే మధ్యమార్గం కోసం అన్వేషిస్తున్నారని, కానీ భారత్ ట్రంప్ సవాసానికి ఉవ్విళ్లూరుతుందన్నారు. దేశ స్వతంత్ర విదేశాంగ విధానాన్ని ట్రంప్‌కు మోదీ తాకట్టు పెట్టాడని విమర్శించారు. పహాల్గామ్ ఘటనలు ప్రతి ఒకరు ఖండించాలని, కానీ ఉగ్రవాదాన్ని అరికట్టాలంటే స్థానికుల సహకారం కూడా అవసరమని, ఆ దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. భారత ప్రయోజనాలు కాపాడేందుకు అమెరికా విధానాన్ని వ్యతిరేకించాలని, దేశం స్వతంత్ర వైఖరి అనుసరించాలన్నారు. దీని కోసం భారత ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. సీనియర్ జర్నలిస్టు రాఘవశర్మ మాట్లాడుతూ ట్రంప్ టారీఫ్ చదరంగం పోటీలా ఉందని ఎద్దేవా చేశారు. ఏ దేశం సుంకాలు విధించినా దాని భారం సామాన్యులపైనే పడుతుందన్నారు. జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత అక్కడున్న భారతీయులకు సంకెళ్లు వేసి ఇక్కడికి తరలిస్తే కనీసం దీన్ని మోదీ ఖండించకపోవడం దారుణమన్నారు. కలుషిత్వాన్ని పెంచి పోషిస్తున్నది అమెరికానే, బిల్‌లాడన్‌ను ప్రోత్సహించింది అమెరికానే అన్నారు. ప్రపంచ దేశాలపై అమెరికా పెత్తనం చేయాలనే తీరును ప్రతి ఒకరు ఖండించాలన్నారు. సిపిఎం కార్యకర్తలు ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తూనే దేశ ఔనత్యాన్ని కాపాడేందుకు ప్రజలను చైతన్యం చేయాలని పిలుపు నిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి మాట్లాడుతూ ట్రంప్ తీరు పిచ్చోడి చేతిలో రాయిలా ఉందన్నారు. అమెరికాలోనే బడాబాబులకు మేలు జరిగేందుకు ప్రపంచంలోని 90దేశాలపై సుంకాలను ట్రంప్ పెంచాడన్నారు. వారి దృష్టంతా ఇప్పుడు వెంకటేశ్వరస్వామిపై పడిందన్నారు. బర్డులో ఉచిత శస్త్రచికిత్సలు జరగం లేదని, స్విమ్స్ అభివృద్ధికి టిటిడి రూ.100 కోట్లు ఇస్తుంటే దాన్ని అడ్డుకోవడం, స్విమ్స్‌లో ముస్లీం, క్రిస్టయన్ ఉద్యోగులు ఉండరాదని చెప్పం శోచనీయమన్నారు. గోవుల గొడవతో రాద్ధాంతం చేస్తుందని, పలమనేరు వద్ద 900 ఎకరాల భూములో గోశాల ఉంటే గోవులను ఎందుకు అక్కడికి తరలించి సంరక్షించకుడదని ప్రశ్నించారు. కల్తీనెయ్యి, భక్తుల తొక్కిసిలాటను రాజకీయం చేయడం, టిటిడి డబ్బుతో దేశ, విదేశాల్లో కల్యాణ మండపాలు కట్టించేందుకు పూనుకోవడాన్ని ఎందుకు అడ్డుకోరో సమాధానం చెప్పాలన్నారు. అన్యాయాన్ని ప్రశ్నించేది, ప్రజల పక్షాన నిత్యం పోరాడేదే సిపిఎం ఒకటేనని తెలిపారు. లేబర్‌కోడ్‌లను వ్యతిరేకిస్తూ మే 20న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇటీవల మధురైలో జరిగిన సిపిఎం జాతీయ మహాసభలకు తిరుపతి నుంచి సైకిల్‌పై వెళ్లి పోరాట స్ఫూర్తిని నింపిన చల్లా వెంకయ్య, కుప్పస్వామిలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సత్కరించారు. రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు మూలం రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, జనార్ధన్, టి.సుబ్రమణ్యం, ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మీ, నగర కార్యదర్శి వేణుగోపాల్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి వి.నాగరాజు



సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు




చల్లా వెంకటయ్య, కుప్పస్వామిని సత్కరిస్తున్న దృశ్యం

భారత్‌తో వివాదం..

పాకిస్థాన్‌కు తీవ్ర నష్టం

ఎస్వీయు పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఆచార్యులు డాక్టర్ బివి మురళీధర్



ప్రజాశక్తి - క్యాంపస్ : భారతదేశంతో వివాదం పెట్టుకోవడం ద్వారా పాకిస్థాన్‌కు తీవ్ర నష్టం కలిగే అవకాశం ఎక్కువగా ఉందని ఎస్వీయు పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ సీనియర్ ఆచార్యులు, పూర్వపు ఆర్ట్స్ కళాశాల అధ్యక్షులు డాక్టర్ బివి మురళీధర్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన "ప్రజాశక్తి"తో మాట్లాడుతూ రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా పాకిస్తాన్ భారతదేశం నుంచి ఎంతో, ఎన్నో ప్రయోజనాలు పొందుతుందని వివరించారు. ముఖ్యంగా నది జలాల విషయంలో భారతదేశం ఒప్పందాలను నీతి, నిజాయితీగా పాటించడం ద్వారా ప్రపంచ పటంలో ఇప్పటికీ పాకిస్తాన్ కనిపిస్తుందంటే దానికి భారతదేశం ఆచరిస్తున్న శాంతియుత విధానాలే అని పేర్కొన్నారు. పాకిస్తాన్ ప్రస్తుత మంత్రి ప్రత్యక్షంగా టీవీ ప్రసారంలో అమెరికా, రష్యాల కోసమే తాము గత 50 సంవత్సరాలుగా ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నట్లు స్వయంగా ఒప్పుకోవడం దారుణం అన్నారు. ఐక్యరాజ్యసమితి కూడా దీనిపై ప్రత్యేకంగా స్పష్టమైన వైఖరితో పాకిస్తాన్‌కు ఉగ్రవాదాన్ని విడిచిపెట్టి ఆ దేశ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని గట్టిగా సూచించాలని అన్నారు.

సింధు నదీజలాల ఒప్పందం రద్దు ప్రభావం

పాకిస్తాన్ మొత్తం నీటి అవసరాల్లో 80% వరకు సింధు నదీ వ్యవస్థపై ఆధారపడుతుంది. ఒప్పందం రద్దైతే పాకిస్తాన్‌లో సాగు భూములు, తాగునీటి ప్రాజెక్టులు తీవ్రంగా దెబ్బతింటాయి. నీటి కొరత వల్ల ఆహార భద్రత, విద్యుత్ ఉత్పత్తి (హైడ్రోపవర్) లోనూ తీవ్ర సమస్యలు తలెత్తుతాయి. పాక్ రాజకీయ-సామాజిక స్థిరతపై కూడా దీని తీవ్ర ప్రభావం ఉంటుంది.

భారత్‌లో ఉన్న ప్రాజెక్టులు, ఆనకట్టలు

భారత్‌లో సింధు ప్రధాన నది, ఉపనదులపై సుమారు 33 ప్రాజెక్టులు ఉన్నాయని ప్రాధమిక సమాచారం. ప్రముఖ ప్రాజెక్టులు: బఘ్లీహార్ డామ్ (చినాబ్ నది), కిషన్‌గంగా ప్రాజెక్టు (నీలం/కిషన్‌గంగా నది), రట్లే ప్రాజెక్టు మొదలైనవి. ఒప్పందం ప్రకారం భారత్, తూర్పు నదులు (సట్లెజ్, బియాస్, రవి) నీటిని పూర్తిగా వినియోగించుకోగలదుబీ పశ్చిమ నదులు (ఇంద్రావతి, చినాబ్, జీలం) పరిమిత వినియోగమే ఉంది. ప్రస్తుతం మొత్తం నదీజలాల్లో సుమారు 20% వరకు మాత్రమే భారత్ వినియోగిస్తోంది.

కొత్తగా ప్రాజెక్టులు కట్టే అవకాశం

సైతం కొత్త హైడ్రోఎలక్ట్రిక్ ప్రాజెక్టులు, సాగునీటి ప్రాజెక్టులు నిర్మించేందుకు భారత్‌కు బహుళ అవకాశం ఉంది. ముఖ్యంగా జమ్మూకాశ్మీర్ లో కొన్ని నదుల ద్వారా ప్రవహించే నీటిని అతి పెద్ద ఆనకట్టలుగా కట్టి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ఇతర రాష్ట్రాలకు తరలించే అవకాశం పుష్కలంగా ఉన్నాయని అన్నారు. ఆ నీటిని "లిఫ్ట్ ఇరిగేషన్" ద్వారా కొంత మేర ఇతర ప్రాంతాలకు తరలించవచ్చు గానీ, ఇది ఖర్చుతో కూడుకున్నది, పరిసర భూభాగాలకే వాడకానికి వీలుందన్నారు. ఇతర నదీ ప్రాంతాలకు తరలించడం, ముఖ్యంగా ఎడారి ప్రాంతాలకు (రాజస్థాన్, హర్యానా, పంజాబ్ లలో) భారీ ఇంజినీరింగ్ సవాలుగా మారుతుందని అన్నారు. అయితే భారతదేశం దీక్షగా పట్టుబడితే అది పెద్ద విషయం కాదని అన్నారు. దేశంలో ఇంజనీర్లు నూతన సాంకేతికతతో ఎడారి ప్రాంతాలకు కూడా నీటిని తరలించే అవకాశాలని కచ్చితంగా వెలికి తీయగలరని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రస్తుతం నీటిని వినియోగిస్తున్న రాష్ట్రాలు

జమ్మూ కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హర్యాణా రాష్ట్రాలు ప్రధానంగా సింధు ఉపనదుల నీటిని వినియోగిస్తున్నాయి. పంజాబ్‌లో సాగు విస్తృతంగా సింధు జలాలపై ఆధారపడింది. హర్యాణాకు కూడా కొంతమేర ప్రత్యేకంగా బియాస్, రవి నీటి ద్వారా నీటి పంపిణీ జరుగుతోంది.

రాజస్థాన్‌కు నీటిని తరలించే వీలుపై..

ప్రస్తుతం ఇందిరా గాంధీ కెనాల్ ప్రాజెక్టు ద్వారా రాజస్థాన్ ఎడారికి సట్లెజ్-బియాస్ నదుల జలాలను తరలిస్తున్నారు. ఇదే మార్గంలో మరింత నీటిని తరలించేందుకు కొన్ని ఆప్షన్లు ఉన్నాయి, కానీ నదీ ప్రవాహాల పరిమితి, భూభాగ భౌగోళిక పరిస్థితులు, అంతర్జాతీయ ఒప్పందాల కారణంగా ఇది పూర్తిగా సాధ్యం కాదు.

ఏది ఏమైనప్పటికీ ప్రపంచంలో అతిపెద్ద అగ్ర దేశమైన రష్యాతో ఉక్రెయిన్ అనవసరమైన రాద్ధాంతం ద్వారా శాంతియుతంగా మూసిపోవాల్సిన చర్చలు రచ్చకేగి యుద్ధం వరకు తీసుకెళ్లి ప్రపంచ దేశాలలో అశాంతులను కలగజేస్తుంది. అదేవిధంగా పాకిస్తాన్ కూడా ప్రాంతీయ ఉగ్రవాదాన్ని రెచ్చగొడుతూ ప్రపంచంలో పెద్ద దేశాలకు తొత్తులుగా, బానిసలుగా బతుకుతూ వారి దేశాన్ని దేశ ఆర్థిక వ్యవస్థను, ప్రజలను నట్టేట ముంచుతూ ఐక్యరాజ్యసమితి ముందు దోషిగా నిలబడుతుందని అన్నారు. ఇప్పటికైనా పాకిస్తాన్ ప్రభుత్వం ప్రజలు తెలుసుకొని అగ్రరాజ్యాలకు తొత్తులుగా ఉండడం మాని, స్వతంత్రంగా జీవించడం సార్వభౌమాధికారాన్ని న్యాయబద్ధంగా, నిజాయితీగా వినియోగించుకొని ఆ దేశ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు.

ప్రయాణికుల భద్రతపై అవగాహనా సదస్సు



ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: హిందూ పర్యాటక కేంద్రాలలో అత్యంత ప్రాధాన్యమైన స్థలం తిరుపతి. ప్రతి రోజు లక్షలాది మంది భక్తులు రైలు మార్గం సహా వివిధ రవాణా మార్గాల ద్వారా ఇక్కడికి చేరుకుంటున్నారు. వారి భద్రతను దృష్టిలో ఉంచుకుని, రైల్వే భద్రత దళం, రైల్వే పోలీస్ విభాగం సంయుక్తంగా తిరుపతి రైల్వే స్టేషన్లో భద్రత అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైల్వేలో పని చేసే అన్ని విభాగాల సిబ్బంది, ముఖ్యంగా ప్లాట్‌ఫారమ్‌లపై నిరంతరం పనిచేస్తూ ప్రయాణికులతో సమీపంగా ఉండే టెక్నికల్ సిబ్బంది, క్లీనింగ్ సిబ్బంది పాల్గొన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ ఎస్.ఆర్.హర్షిత మాట్లాడుతూ రైల్వే పరిసరాలలో ఏవైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, లేదా అసాంఘిక చర్యలు చోటుచేసుకున్నా, వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ప్రయాణికుల రక్షణ కోసం 24 గంటలు అప్రమత్తంగా ఉన్నామని తెలిపారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో పునర్నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో, ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా అన్ని తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. రేణిగుంటలో ఆర్పీఎఫ్ ఇన్స్పెక్టర్‌గా సేవలందించిన సందీప్ తిరుపతి స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలుపుతూ, తిరుపతిలోనూ తన అంకితభావ సేవలతో ప్రయాణికుల భద్రతను మరింతగా బలోపేతం చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే పోలీస్ ఇన్స్పెక్టర్ ఎం.ఆశీర్వాదం, సబ్ ఇన్స్పెక్టర్లు ధర్మేంద్ర రాజు, రామకృష్ణారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఊరూరా సిండికేట్ 'నిషా'



- వేలం పెట్టిమరీ విక్రయాలు
- 'బెల్టు' తీయని అధికారులు
- పేదలే సమిధలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : పల్లెల్లో గుక్కెడు నీటి కోసం కరువేమో కానీ.. దోసెడు మద్యానికి మాత్రం కొదవే లేదు. హాహాకారాలు పెట్టినా నీళ్ళొస్తాయో..! రావో.? తెలియదు కానీ.. ఫోన్ కొడితే చాలు క్వార్టర్ మాత్రం చేతికొస్తుంది. ఇది రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలొకొచ్చాక పల్లెల్లో అమలవుతున్న నయా మద్యం పాలసీ కథ. గతం కంటే తామేమీ భిన్నం కాదంటూ కూటమి ప్రభుత్వం నిరూపించుకుంటోంది. ఊరారా బెల్టు షాపులు వెలిసినా పట్టించు కునే నాథుడు కరువ య్యారు. ఆబ్కారీ శాఖ ఉందో లేదో తెలియని పరిస్థితి. " తాగండి.. తాగి ఊగండి.. ఊగి సావండి " మాకేంటి అన్న రీతిలో ఆ శాఖాధికారులు వ్యవరిస్తున్నారన్న విమర్శలు వస్తు న్నాయి. కొత్త మద్యం పాలసీ అంటూ ధరలు తగ్గించినా బెల్టు దుకాణాల్లో మాత్రం బాటిల్ పై రూ.50 నుంచి రూ.100 అదనంగా వసూలు చేస్తూ పేదల జేబులకు చిల్లులు పెడుతు న్నారు. ఈ సొమ్మంతా తిరిగి 'సిండికేట్' అధినేతకే చేరు తోంది. శ్రీకాళహస్తి నియో జకవర్గంలో మండలానికో సిండికేట్ కింగ్ ను నియమించి, ఊరారా బెల్టు షాపులు పెట్టి మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. అంతిమంగా పేదలనే సమిధలను చేస్తున్నారు. అంతకుమించి మద్యానికి కట్టు బానిసలను చేస్తున్నారు.

ఊరూరా 'సిండికేట్ నిషా'


'గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహించడానికి వీల్లేదు..! ఎవరైనా బెల్ట్ షాపులు పెడితే బెల్ట్ తీస్తా..! ఎమ్మార్పీ ధరకు మించి విక్రయాలు జరిపితే తోలు వొలుస్తానంటూ సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు బహిరంగ సభలనుద్దేశించి చేసిన వ్యాఖ్యలివి. మద్యం విక్రయాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి నేతలు ఎట్టి పరిస్థితుల్లోనూ జోక్యం చేసుకోవ ద్దంటూ కూడా సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయితే అందుకు భిన్నంగా కొందరు కూటమినేతలు వ్యవహరిస్తున్నారు. మద్యం షాపుల కేటాయింపులో సిండికేట్ గా ఏర్పడి దుకాణాలు దక్కించుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

శ్రీకాళహస్తి నియోజకవర్గానికి కేటాయించిన 31 మద్యం దుకాణాలను సిండికేట్‌గా దక్కించు కున్నారు కూటమి నేతలు. అక్కడితో ఆగకుండా ఒక్కో దుకాణం పరిధిలో పదికి పైగా బెల్టు షాపులకు వేలం పాట పెట్టి మరీ కూటమి కార్యకర్తలకు కేటాయించారన్న ఆరోపణలు ఉన్నాయి. క్వార్టర్ పై రూ. 50, ఫుల్లుపై రూ. 100 అందనంగా బెల్టు నిర్వాహకులు మందు బాబుల నుంచి గుంజుతున్న పరిస్థితి. ఈ లెక్కన దాదాపు అన్ని గ్రామాల్లో 'సిండికేట్ మద్యం నిషా' అన్ని వేళలా..మరింత ప్రియానికి అందుతుందన్న మాట. ఈ నేపథ్యంలో మద్యం సిండికేట్లు రూ. కోటాను కోట్లు వెనకేసుకుంటుండగా.. పేదలు మాత్రం తమ కష్టాన్ని మద్యానికి ధారబోస్తూ జేబులు, శరీరానికి చిల్లులు పెట్టుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పల్లెల్లో బెల్టు దుకాణం లేకుండా బెల్ట్ తీయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉపాధి హామీతో

గ్రామాల సమగ్రాభివృద్ధి

■ పంచ ప్రాధాన్యతలతో పని దినాల పెంపు .. ప్రజాశక్తితో డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్



ముఖా ముఖి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా తిరుపతి జిల్లా పరిధిలో గ్రామాలను సమగ్ర అభివృద్ధితో తీర్చిదిద్దుతున్నామని, ఇందుకోసం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సూచనలతో ప్రత్యేక కార్యచరణ రూపొందించి జిల్లా వ్యాప్తంగా అవసరమైన చోట ఉపాధి హామీ నిధులను వెచ్చించడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తిరుపతి జిల్లా వ్యాప్తంగా చేసే అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజాశక్తి నిర్వహించిన ప్రత్యేక ముఖాముఖిలో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస ప్రసాద్ వివరించారు.

ప్రజాశక్తి: గత 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి హామీ కూలీలకు, మెటీరియల్ కాంపోనెంట్ నిధులు ఎంత బకాయి ఉన్నాయి?

డ్వామా పీడీ: 2024 - 25కి సంబంధించి 120 కోట్ల రూపాయలు ఉపాధి హామీ, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, మెటల్ రోడ్లు, ప్రహరీలు, గో కులాలు నిర్మాణాలకు సంబంధించి ఉన్నాయి. రానున్న పది రోజుల్లో వీటికి సంబంధించిన బకాయిలను పూర్తిగా చెల్లిస్తాము. ఈ ఆర్థిక సంవత్సరం తిరుపతి జిల్లాలో మారుమూల గ్రామాలలో కూడా మౌలిక వసతుల కల్పన కోసం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సూచనలతో ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేశాం.

ప్రజాశక్తి: ఉపాధి హామీ పని దినాల పెంపుకు ఏదైనా చర్యలు తీసుకున్నారా?

డ్వామా పీడీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పని దినాల పెంపుకు శ్రీకారం చుట్టాం. రూ.300 రూపాయలు తగ్గకుండా ఉపాధి హామీ పనులు కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. ప్రస్తుతం పొలం పనులు తగ్గిపోవడంతో ఉపాధి హామీ పనులు ద్వారా ఆర్థిక భరోసా కల్పించాలని నిర్ణయించాం.

ప్రజాశక్తి: పంచ ప్రాధాన్యతలో, తిరుపతి జిల్లాలో చేపట్టిన అభివృద్ధి ప్రణాళికను వివరించండి?

డ్వామా పీడీ: జిల్లాలో ఉన్న అన్ని దళిత వాడల్లో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టడానికి చర్యలు తీసుకున్నాం. ఇవే కాకుండా ప్రధాన మార్గాల నుండి గ్రామాలకు వెళ్లే రోడ్డులు అనుసంధానం చేయడానికి నిర్ణయించాం. గ్రామం నుండి ప్రధాన మార్గానికి 400 మీటర్ల లోపు ఉంటే సీసీ రోడ్లు వేయడానికి అనుమతిస్తున్నాం. అలానే 400 మీటర్ల పైబడి ఉంటే బీటీ రోడ్లను వేయడానికి అనుమతులు ఇస్తున్నాం. జిల్లావ్యాప్తంగా గ్రామా లలో ప్రజలు రాకపోకలు సాగించడానికి వీలుగా రోడ్ల నిర్మాణం వివిధ దశల్లో పూర్తి చేయడానికి కార్యచరణ రూపొందించాం.

ప్రజాశక్తి: వేసవి దృశ్య ఉపాధి హామీ పథకం ద్వారా పాడి రైతులకు ఉపయుక్తమైన కార్యక్రమం ఏదైనా చేశారా?

డ్వామా పీడీ: ప్రస్తుతం వేసవిలో మూగజీవాలకు నీటి ఎద్దడి మొదలైంది. దీనిని అధిగమించడానికి జిల్లావ్యాప్తంగా 1240 నీటి తొట్టెలను ఇప్పటికే నిర్మించాం. ఈ నీటి తొట్టెల ద్వారా పాడి రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఒక్కో నీటి తోట నిర్మాణానికి రూ. 38 వేల రూపాయలు చెల్లిస్తున్నాం. ఆవులకు సమృద్ధిగా నీటిని అందించడానికి ఈ చర్యను తీసుకున్నాం. అడవి నుండి నీటి కోసం వచ్చే వన్యప్రాణులకు కూడా ఉపాధి హామీ పథకం ద్వారా ఈ నీటి తొట్టెలను ఏర్పాటు చేయడం జరిగింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు తిరుపతి - కరకంబాడి మార్గంలోని అటవీ శాఖకు చెందిన బయోట్రీమ్ వద్ద అడవి నుండి వన్యప్రాణులు దాహార్తి తీర్చుకోవడానికి సమీప జననివాసాలకు వస్తున్నడాన్ని తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. దీంతో 2500 లీటర్ల సామర్థ్యం గల నీటి తొట్టెలను మూడింటిని బయోట్రిమ్ లో నిర్మించామన్నారు.

ప్రజాశక్తి: గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింతగా ఉపయుక్తమైన కార్యక్రమం ఏదైనా చేశారా?

డ్వామా పీడీ: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, గ్రామీణ నీటిపారుదల సరఫరా విభాగం ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల లో కమ్యూనిటీ ఇంకుడు గుంతలను నిర్మిస్తున్నాం. అవి ప్రజలకు చాలా ఉపయోగపడుతున్నాయి. వర్షపు నీరు, గృహపు వ్యర్థనీరు ఈ కమ్యూనిటీ ఇంకుడు గుంత ద్వారా భూమిలోకి వెళ్లి భూగర్భ జలాలను పెరగడానికి అవకాశం ఎక్కువ ఉంది. ఇందుకోసం ఒక్కొక్క కమ్యూనిటీ ఇంకుడు గుంత నిర్మాణానికి 55వేల రూపాయలను వెచ్చిస్తున్నాం.

ఏఎస్ఐ శేఖర్ రెడ్డి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - రామచంద్రపురం : రామచంద్రాపురం మండల రక్షక భట్ట నిలయంలో అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్‌గా పని చేస్తున్న శేఖర్ రెడ్డి సేవలు అభినందనీయమని చంద్రగిరి డిఎస్పి ప్రసాద్ అన్నారు. ఆదివారం మిట్టూరు కమ్యూనిటీ హాల్లో శేఖర్ రెడ్డి పదవీ విరమణ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి చంద్రగిరి డిఎస్పి ప్రసాద్, సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్బరామిరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రవీంద్రనాథ్, పోలీస్ యూనియన్ నాయకులు ప్రసాద్ రాజు, సోమశేఖర్, సిబ్బంది రాజశేఖర్, మహేష్, వెంకటేష్, రమేష్ రెడ్డి, దివ్య, నాయకులు కోరా హరి ప్రసాద్, కోటేశ్వర్ రెడ్డి, మహిళ నేత సుగుణమ్మ ,ఆకా దేవరాజులు, విజయ్ కుమార్ రెడ్డి, మహేష్, ధనుంజయ రెడ్డి, ముని రామిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

టైలర్‌కు ఆర్థిక సాయం

ప్రజాశక్తి -కోట : కోట మండలం, కోట దళితవాడకు చెందిన టైలర్ యర్రమతి వెంకటేశ్వర్లు కుమార్తె తీవ్ర అనారోగ్యానికి గురై చెన్నై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇటీవల కుమారుడు, భార్యను కోల్పోయిన యర్రమతి వెంకటేశ్వర్లు ఆర్థిక పరిస్థితి దీనస్థితిలో ఉంది. ఈ క్రమంలో కుమార్తె అనారోగ్యానికి గురవడంతో దిక్కు తోచలేదు. స్థానికులతో కలిసి టీడీపీ తిరుపతి పార్లమెంట్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్‌ను సాయం చేయాల్సిందిగా కోరారు. వెంటనే స్పందించిన జలీల్ అహ్మద్ 10 వేలు ఆర్థికసాయం చేశారు. గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ దృష్టికి తీసుకెళ్లి సీఎం సహాయ నిధి ద్వారా సాయమందేలా చూస్తామన్నారు.

యువతకు స్ఫూర్తి సుబ్రహ్మణ్యం రెడ్డి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : యువతకు స్ఫూర్తి ప్రదాత స్వర్గీయ డాక్టర్ బుచ్చిరెడ్డిగారి సుబ్రహ్మణ్యం రెడ్డి, అతని సేవలు చిరస్మరణీయమని నెహ్రూ యువజన సేవా సంఘం అధ్యక్షురాలు జ్యోతి లక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం వడమాలపేట మండలం ఎస్‌వి పురంలో నెహ్రూ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో సేవాభారతి సంస్థ అధ్యక్షులు స్వర్గీయ సుబ్రహ్మణ్యం రెడ్డి సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన అవార్డు గ్రహీత వెంకమరాజు, సంఘ సభ్యులు మురళి, లోకేష్, నాధముని, నాగభూషణం రాజు, చంద్రశేఖర్ రాజు, మీరయ్య, చంద్రశేఖర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, కిషోర్ పాల్గొన్నారు.

ఏనుగు దాడిలో రైతు మృతి బాధాకరం

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: శుక్రవారం రాత్రి ఏనుగు దాడిలో మృతి చెందిన చిట్టిచెర్ల పంచాయితీ, దాసరగూడేనికి చెందిన సిద్దయ్య కుటుంబాన్ని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పరామర్శించారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన నష్టపరిహారాన్ని త్వరగా అందిస్తామన్నారు. అటవీ సమీప గ్రామాల రైతులు రాత్రి పూట జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్వి.రమణారెడ్డి, సంద్ర మోహన్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు హెచ్ లోకనాథ, చిట్టిచెర్ల మాజీ సర్పంచ్ సహదేవరెడ్డి, సి.మునస్వామి నాయుడు, నాగచంగమ నాయుడు, బి. కుమారస్వామి రెడ్డి, సేనాపతి, చిన్నగొట్టిగల్లు శేఖర్, చాంద్ బాషా, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల కట్టడికే కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : నేరాల కట్టడికే కార్డన్ సెర్చ్ అని గూడూరు డిఎస్పీ గీతా కుమారి పేర్కొన్నారు.. ఆదివారం గూడూరు రెండో పట్టణంలోని తిలక్ నగర్‌లో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ గీతా కుమారి మాట్లాడుతూ ప్రజలు అనుమానితులు కనపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ శ్రీనివాస్, ఎస్ఐ లు సుబ్రమణ్యం రాజు, మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఐస్ క్రీం వితరణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అఖిల భారతీయ క్షత్రియ మహాసభ, (1897) పుత్తూరు వారిచే కెయన్ రోడ్డు హిమజ స్కూల్ వద్ద, 300 మందికి ఐస్ క్రీమ్స్ వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో డా.రవిరాజు, ఎం.నిశిదా రాజు, కోనేటి రవిరాజు క్షత్రియ మహా సభ ఆంధ్రప్రదేశ్, అధ్యక్షులు చంద్రశేఖర్ రాజు, జనరల్ సెక్రటరీ కోనేటి రవిరాజు, యూత్ ప్రెసిడెంట్ బాలసుబ్రమణ్యం రాజు, తిరుపతి జిల్లా సెక్రటరీ కె.రవీంద్ర వర్మ, ట్రెషరర్ ప్రసాద్ వర్మ, మెంబెర్స్ రామ్మోహన్ వర్మ, హరిలు పాల్గొన్నారు.

చోరీల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : వేసవి దృష్ట్యా దొంగతనాలు పెరిగే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని గూడూరు రెండో పట్టణ సిఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి బయట బైక్‌లు ఉంచేటప్పుడు తప్పనిసరిగా లాక్ చేయాలని సూచించారు. గూడూరు రైల్వే స్టేషన్ 1వ ప్లాట్‌ఫాం వద్ద బైక్ పార్కింగ్ వినియోగించాలన్నారు. ఇల్లు ఖాళీగా వదిలేటప్పుడు పక్కవారికి సమాచారం ఇవ్వండి బలమైన తాళాలు ఉపయోగించాలన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపడితే గూడూరు రెండో పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

వైసీపీ నేతలను కలిసిన హరిప్రసాద్ రెడ్డి



మిథున్ రెడ్డితో హరి ప్రసాద్

ప్రజాశక్తి - క్యాంపస్ : ఇటీవల వైసీపీ రాష్ట్ర ప్రచార విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన వి.హరిప్రసాద్ రెడ్డి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీలోని పెద్దలు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎస్వీ సుబ్బారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, పార్టీ నేతలు భూమన కరుణాకర్ రెడ్డి, భూమన అభినయ రెడ్డి తదితరులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పోతు మురళీధర్, సుధాకర్ రెడ్డి, శివ కృష్ణ యాదవ్, నరేష్, హేమంత్ రెడ్డి, సుధీర్ రెడ్డి, కిషోర్ దాస్, హరి, సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

సిటీ టెర్రస్ గార్డెన్ 4వ వార్షికోత్సవం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగరంలోని సిటీ టెర్రస్ గార్డెన్స్ (సిటీజీ) 4వ వార్షికోత్సవం ఆదివారం సరస్వతి శిశు మందిర్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎస్వీ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ రాళ్లపల్లి రామమూర్తి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాన ఉపన్యాసం చేసిన రిటైర్డ్ ప్రిన్సిపాల్, వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఎమ్ హేమంత్ కుమార్ సిటీజీ సభ్యులకు మిల్లెట్స్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. చిరు ధాన్యాలతో ఆరోగ్య రక్షణ ఎలా చేసుకోవాలోనన్న సూచనలు చేశారు. బెస్ట్ గార్డెన్స్ నిర్వహిస్తున్న వారికి అవార్డులు బహూకరించారు. ఈ కార్యక్రమంలో సిటీజీ వ్యవస్థాపక సభ్యులు ప్రసన్న కుమారి, డాక్టర్ ఎంసీ వెంకటనాథ్, జీఎల్ మనోహర్, నదింపల్లి కృష్ణ, మోహన్ రావు, జి.సుధ, నాగశ్రీ, తేజోవతి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల పట్ల జాగ్రత్తగా ఉండండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఎండ తీవ్రత నానాటికీ పెరుగుతున్న నేపథ్యంలో టపాకాయల గోదాముల్లో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీకాళహస్తి లేబర్ అధికారి రంగనాథ్ సూచించారు. తొట్టంబేడు మండల కేంద్రంలో ఉన్న పలు టపాకాయల గోదాములను ఆదివారం కార్మిక, రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖాధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. పలు గోదాముల్లో నిబంధనలకనుగుణంగా అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోకపోవడంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మండలం డెప్యూటీ తహశీల్దార్ జగన్మోహన్, శ్రీకాళహస్తి ఫైర్ అధికారి ఎన్ నాగార్జున రెడ్డి, టూ టౌన్ ఎస్ఐ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సిటీ ఛాంబర్ ఉగాది పురస్కారాలు



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి సిటీ ఛాంబర్ ఆధ్వర్యంలో 1220వ కార్యక్రమం "ఉగాది పురస్కార కార్యక్రమం" స్థానిక మహతి ఆడిటోరియంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు, ఎమ్.ఎల్.సి. డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, యాదవ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, మాజీ మంత్రి పరసా రత్నం, దేవస్థానం మాజీ పాలక మండలి సభ్యులు పోకల అశోక్ కుమార్, తిరుపతి మాజీ శాసనసభ సభ్యులు మోహన్, సుగుణమ్మ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ న్యాయ కళాశాల ఛైర్మన్ డాక్టర్ తిప్పారెడ్డికి, సమాజ సేవకులు, సీనియర్ రాజకీయ నాయకులు మందలపు మోహనరావుకి జీవిత సాఫల్య పురస్కారం, చార్టర్డ్ అకౌంటెంట్ ఎం.ఆర్.ఎస్. శ్రీనివాస్, తిరుపతి కార్పొరేటర్ అన్నా అనితా యాదవ్, డాక్టర్ అర్చన, వెంకటరమణ, డాక్టర్ పి.గోపాల్, సాంబోలు హరనాథ్, ఎస్.సరళకు ఉగాది పురస్కారం, పద్మజకు ప్రత్యేక గౌరవ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ ఏ ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ సిటీ ఛాంబర్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు స్వచ్ఛంద సంస్థలకు ఆదర్శమని కొనియాడారు. ఎమ్.ఎల్.సి డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత 28 సంవత్సరాలుగా సిటీ ఛాంబర్ వారి ప్రతి కార్యక్రమంలో తాను పాల్గొన్నానని గుర్తు చేశారు. యాదవ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్ మాట్లాడుతూ తిరుపతి సిటీ ఛాంబర్ వారు జాతీయ స్థాయిలోని మహానుభావులను గుర్తించి వారిని తిరుపతికి ఆహ్వానించి ఉగాది పురస్కారం అందజేసినందుకు తిరుపతి వాసిగా సిటీ ఛాంబర్‌కు తాను రుణపడి ఉన్నానని అన్నారు. మాజీ మంత్రి పరసా రత్నం, మాజీ ఎమ్మెల్యేలు మోహన్, సుగుణమ్మ, టీటీడీ మాజీ సభ్యులు పోకల అశోక్ కుమార్ మాట్లాడుతూ ఉగాది పురస్కార గ్రహీతలను తిరుపతి సిటీ ఛాంబర్ వారు ఎంచుకున్న విధానం గతంలో ఎన్నడూ లేని విధంగానూ, భవిష్యత్తులోనూ ఉండబోదని ప్రశంసించారు. అనంతరం సిటీ ఛాంబర్ అధ్యక్ష కార్యదర్శులు ఆయుబుఖాన్, షణ్ముగం యాదవ్, కార్యక్రమ ఛైర్మన్ కె.ఎస్.వాసు అవార్డు గ్రహీతలను సభకు పరిచయం చేసి వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి సిటీ ఛాంబర్ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ స్టాన్లీ జయకుమార్, డాక్టర్ కరుణానిధి, పి.సి.స్వామి, స్వరాజ్య లక్ష్మి, వేణు తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం వ్యక్తిగత దూషణలకు పాల్పడదు : శ్రీనివాసరావు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : సిపిఎం పార్టీ ఎప్పుడు వ్యక్తిగత దూషణలకు పాల్పడదని, సిపిఎం వ్యక్తుల కోసం కాకుండా, ప్రజల కోసం పనిచేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు తెలిపారు. 'ట్రంప్ దూకుడు భారత్ పై దాని ప్రభావం' సదస్సులో పాల్గొనేందుకు తిరుపతికి వచ్చిన ఆయన రఘురామకృష్ణమరాజు విలేకరుల సమావేశంలో చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. ఉండి నియోజకవర్గంలో పేదలకు ఎలాంటి ప్రత్యామ్నాయం చేయకుండా ఇళ్లు కూల్చడం సరైనది కాదన్నారు. ఇల్లు కూల్చివేత అప్పుడు ఓ మహిళ గుండె పోటుతో చనిపోయిందని, చనిపోయిన ఆమె పేరుతో రెండు రోజుల తర్వాత అధికారులు నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో అర్హులకు అందరికీ ఇంటి స్థలాలు ఇచ్చి పక్కా ఇల్లు కట్టిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటికే కట్టుకున్న ఇళ్లకు రెగ్యులర్ చేస్తామని తెలిపారని, అది ఆఖరికి రైల్వే స్థలమైన ఇళ్లు తప్పకుండా కట్టిస్తామని హామీ ఇచ్చారన్నారు. మరి ఇప్పుడు ఎందుకు ఇలా చేస్తున్నారని ప్రశ్నించారు. పేదలు నివసిస్తున్న ఇళ్లపై దౌర్జన్యం చేశారని, అదే పక్కన ప్రభుత్వ భూములు కబ్జా చేసి తన స్వాధీనం ఉంచుకున్న పెద్దలను ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. ప్రజల కోసం సిపిఎం నిరంతరం పోరాడుతూనే ఉంటుందని, బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటూ పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు.

ఆదిశంకరలో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సరాస్ కంపెనీ కోఫౌండర్ అమిత్ కటారియా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గూడూరు ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 650 మంది విద్యార్థినీ విద్యార్థులు ప్లేస్మెంట్స్ సాధించారు. కళాశాలలో విద్యార్థినీ విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సభలో అతిథులుగా కళాశాల చైర్మన్ వంకి పెంచలయ్య, వైస్ చైర్మన్ అనూషలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వేణుమాధవ్, ధనుంజయ, ఏవో రామయ్య పాల్గొన్నారు.

కోనోకార్పస్ చెట్లపై దుష్ప్రచారం బాధాకరం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శాస్త్రీయంగా కోనోకార్పస్ ప్రమాదమని ఎక్కడా నిరూపితం అవకుండానే పర్యావరణహితంకు మరింతగా చేయూతనిచ్చే ఈ చెట్టును తొలగించాలని దుష్ప్రచారం చేయడం బాధాకరమని వృక్షశాస్త్ర నిపుణులు ప్రొఫెసర్ బయ్యపురెడ్డి అన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో అవగాహన సదస్సును నిర్వహించారు. నాలుగున్నర సంవత్సరాల పాటు కువైట్‌లో కోనోకార్పస్ చెట్టుపై వివిధ రకాల పరిశోధనలు జరిపామన్నారు. ఎడారి ప్రాంతంలో ఉండే ఉష్ణోగ్రతను తట్టుకొని ఎదగగల చెట్టుగా కోనోకార్పస్ గుర్తింపు ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా కోనోకార్పస్ చెట్లును వినియోగించే ఫోటోలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ అవగాహన సదస్సులో ఎస్వీ యూనివర్సిటీ జియాలజీ ప్రొఫెసర్ టీవీ.కృష్ణారెడ్డి, ఆల్ ఇండియా నేషనల్ బీసీ ఫ్రంట్ కన్వీనర్ కేఎంఎల్. నరసింహ, ప్రముఖ ఆడిటర్ పాల్గున కుమార్ పాల్గొన్నారు.

జిల్లాలో పలువురు సిఐలు బదిలీ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ ఆదివారం అదేశాలు జారీ చేశారు. గాజులమండ్యం సిఐ ఈ.మురళీకృష్ణను విఆర్ కు, శ్రీకాళహస్తి టూ టౌన్ సిఐ వెంకటేశ్వర్లును వీఆర్ కు, వి ఆర్ లో ఉన్న నాగార్జునరెడ్డిని శ్రీకాళహస్తి, ఏర్పేడు సీఐ జయచంద్రను రేణిగుంటకు, రేణిగుంట సీఐ శరత్ చంద్రను వీఆర్‌కు, విఆర్‌లో ఉన్న శ్రీకాంత్ రెడ్డిని ఏర్పేడుకు, డిఐజి విఆర్‌లో ఉన్న మంజునాథ్ రెడ్డిని తిరుపతి ఎస్పి వీఆర్1 బదిలీ చేశారు. ఈ మేరకు రెండు మూడు రోజుల్లో బదిలీ అయిన సిఐలు ఆయా ప్రాంతాల్లో బాధ్యతలు చేపట్టనున్నారు.

గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశ పరీక్షలు

ప్రజాశక్తి - సత్యవేడు: తిరుపతి జిల్లా, సత్యవేడు, మహాత్మ జ్యోతి బా పూలే బాలుర గురుకుల పాఠశాలలో ఆదివారం 5వ తరగతి ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ప్రధానాచార్యులు సత్యనారాయణ, డిపార్ట్మెంట్ అధికారి అనూష తెలియజేశారు. మొత్తం 34 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయాల్సి ఉండగా 25 మంది రాసినట్లు తెలిపారు.

2 నుండి వేసవి క్రికెట్ శిక్షణా శిబిరం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఏ.సి.ఏ సబ్ సెంటర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం మే నెల రెండవ తేదీ నుండి ప్రారంభమవుతుందని ఆసక్తి గలవారు రెండవ తేదీ స్టేడియం వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సబ్ సెంటర్ ఇన్చార్జ్ ముని గిరీష్ వెల్లడించారు. గూడూరు, అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఏ.సి.ఏ సబ్ సెంటర్ ఇన్చార్జ్ ముని గిరీష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అనిల్, లవ కుమార్, సురేందర్ రెడ్డి, నాగేశ్వరరావు, మహేష్, మస్తాన్, రజిని, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం పోరాటం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఇల్లు నిర్మాణం పనులు చేసే భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం ఇంటి స్థలాలు కల్పించాలని కోరుతూ పోరాటం చేయనున్నట్లు బాలాజీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మలకుప్పం శేఖర్ తెలిపారు. కొర్లగుంట తిరుమల బైపాస్ రోడ్డు శిరిడి సాయిబాబా మందిరంలో ఆదివారం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులందరూ సభ్యత్వం తీసుకోవాలని యూనియన్‌లో మెంబర్‌గా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ తంగవేలు మేస్త్రి, ఉపాధ్యక్షులు అల్లాబక్ష, ప్రధాన కార్యదర్శి జె రమణ, ట్రెజరర్ సుబ్రమణ్యం, జీవి రమణ, వై జగన్నాధం, విజయ్ కుమార్, ఎం రమణ, కృష్ణమూర్తి, గుంజ శ్రీనివాసులు, రాజశేఖర్, ప్రసాద్, రమేష్ నాయుడు, గోవిందరాజులు, హరి పాల్గొన్నారు.

ముస్లిం మైనారిటీలకు సభ్యత్వ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు మున్సిపాలిటీ 55వ బూత్ మహమ్మద్ వీధిలో నగరి నియోజకవర్గ శాసనసభ్యులు గాలి భాను ప్రకాష్ ఆదేశాలు మేరకు ముస్లిమ్ మైనారిటీలకు ఆదివారం టీడీపీ సభ్యత్వ కార్డులు పంపిణీ జరిగినది. 9వ వార్డ్ పార్టీ అధ్యక్షులు రాజా, గేట్ పుత్తూరు మసీదు మస్జిద్ ఏ ముఖద్దస్ ముతవల్లి మహమ్మద్ గౌస్, పుత్తూరు పట్టణ టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షులు మొహమ్మద్ రఫీ చిత్తూరు పార్లమెంట్ మైనారిటీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.కే.షబ్బర్, నగరి నియోజకవర్గం టిడిపి తెలుగు యువత ఆర్గనైజ్ సెక్రెటరీ ఎస్ హామీద్ బాషా, జాబీర్ పట్టణ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మోహన, యూనిస్, షకీల్ జాఫర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయు పరీక్షల నియంత్రణ అధికారిగా రాజమాణిక్యం



ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయు పరీక్షల నూతన నియంత్రణ అధికారిగా రాజమాణిక్యంను యూనివర్సిటీ ఉన్నతాధికారులు నియమించారు. గతంలో సీఈగా పనిచేసిన మూడే దామ్లా నాయక్ సెలవుపై వెళ్లిపోవడంతో వర్సిటీ ఉన్నతాధికారులు ఆగమేఘాలపై నియామకం చేపట్టారు. సాధారణంగా సెలవుపై వెళ్తే ఒక అధికారి స్థానంలో వేరొకరికి ఇన్చార్జ్ బాధ్యతలు అప్పగిస్తారు. అయితే వర్సిటీ ఉన్నతాధికారులు పరీక్షల అధికారికి మధ్య ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ సెలవుపై వెళ్లిన సీఈని తొలగించి మరొక ప్రాంతానికి ట్రాన్స్ఫర్ చేసి ఆ సీట్లో వేరే వారిని నియామకం చేశారు. పరీక్షలలో విద్యార్థులకు హాల్ టికెట్‌లలో పేపర్లు, ఫోటోలు తప్పులు దొర్లాయని దానికి తాను బాధ్యుడిని కాదని, జ్ఞానభూమి పోర్టల్ అధికారులు వర్సిటీకి ఏమాత్రం సహకరించలేదని సీఈ పలుమార్లు అధికారులకు చెప్పినట్లు వర్సిటీలో బోధనేతర సిబ్బంది చర్చించుకుంటున్నారు. ఒక నిజాయితీ గల ఆఫీసర్ వ్యక్తిగత సెలవులపై వెళ్తుంటే ఆ పదవిలో వేరే వ్యక్తిని నియమించడం పట్ల అధికారులకు ఆయనకు పొసగలేదని వర్సిటీలో ప్రచారం జరుగుతోంది. నూతన సీఈ జ్ఞానభూమి పోర్టల్ అధికారులతో సమర్థవంతంగా పనిచేయించగలరా అనేది అనుమానంగానే ఉంది. అంతేకాకుండా పరీక్షల విభాగాన్ని సంస్కరిస్తామని కూటం ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి చెబుతున్న అధికారులు వాటి గురించి పట్టించుకోకపోవడం, వర్సిటీలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై నూతన సీఈ చర్యలు తీసుకుంటారా లేదా అనేది వేచి చూడాలి.

డాక్టర్ తిప్పారెడ్డికి ఘన సన్మానం



ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి సిటీ ఛాంబర్ ఆధ్వర్యంలో ఆదివారం మహతి ఆడిటోరియంలో సమాజంలో వివిధ సేవలు చేసిన వారిని గుర్తించి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా డాక్టర్ అంబేద్కర్ గ్లోబల్ లా ఇన్స్టిట్యూట్ అధినేత ఆర్. తిప్పారెడ్డి సేవలను గుర్తించి ఆయనకు లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డుతో సత్కరించారు. ఈ సన్మాన కార్యక్రమంలో పవన్ యాదవ్, శ్రీనివాసులు, హరికృష్ణ యాదవ్ ,నాగవర్ధన్, మహేష్ ,రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇండోనేషియా వర్సిటీతో ఎస్వీయూ ఒప్పందం

ప్రజాశక్తి - క్యాంపస్ : ఇండోనేషియాలోని బాండుంగ్‌లో గల ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ యూనివర్సిటీతో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం చేసుకోవడానికి అంగీకారం కుదిరింది. బోధన, పరిశోధన రంగాల్లో ఈ రెండు విశ్వవిద్యాలయాల మధ్య పరస్పర సహకారించుకునేందుకు నిర్ణయించారు. ఈ క్రమంలో ఇండోనేషియా యూనివర్సిటీ ప్రతినిధులు డాక్టర్ మిత్ర డి జమల్ తదితరుల బృందం, ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ అప్పారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు, మాజీ రెక్టార్ ప్రొఫెసర్ సికె జయశంకర్, ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ దేవప్రసాద రాజుతో సమావేశమయ్యారు. ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు నేతృత్వంలో జూలై నెలలో ఇండోనేషియాలో ఎస్వీయూ ప్రతినిధుల బృందం పర్యటించనుంది.

ఉగ్ర దాడిపై నిరసనలు



ప్రజాశక్తి - నాయుడుపేట: భారతదేశంపై పాకిస్తాన్ ఉగ్రవాదులు చేసిన దాడిని నిరసిస్తూ నాయుడుపేట యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 7:30 సమయంలో టీచర్లు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదులు భారతదేశంలో చొరబడి అమాయకులను కాల్చి చంపడం హేయమైన చర్య అని, ఈ దాడిలో చనిపోయిన భారతీయుల ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నామని అన్నారు. ఈ ర్యాలీలో యు టీ ఎఫ్ నాయకులకు సిఐటియు నాయకులు మద్దతుగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్లు శేఖర్, గోవర్ధన్ రెడ్డి, రామ్మూర్తి రాజు, సుబ్బారావు, నాయుడుపేట సిఐటియు నాయకులు ముకుంద పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: కాశ్మీర్ పహల్గావ్‌లో భారత టూరిస్ట్‌లపై పైశాచికంగా దాడులు చేసి హతమార్చిన పాకిస్తాన్ తీవ్రవాదులపై భారత్ ప్రభుత్వం కఠిన వైఖరి అవలంబించాలని కోరుతూ తిరుపతి ప్రకాశం మున్సిపల్ పార్క్, వాకర్స్ అసోసియేషన్ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గోపీనాథ్, కార్యదర్శి చంద్రకాంత్, గౌరవ అధ్యక్షులు వెంకటరెడ్డి, కేశవులు ఉడియార్, కోలా లక్ష్మీపతి, భక్తవత్సలం, టీ.దాసు, వెంకట ముని, ముని బాబు, గురునాథ్, మస్తాన్, రాజేశ్వరి, రఘునాథ బాబు, కొత్తపల్లి మునిరత్నం, బలరామిరెడ్డి, కొత్తపల్లి శంకరయ్య, వెంకటరమణయ్య శెట్టి, సుబ్బయ్య, భాస్కర్, సత్య మహేష్ ,వెంకటేష్, మధు, తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనారిటీల ఆధ్వర్యంలో..

ప్రజాశక్తి -వరదయ్యపాలెం : జమ్మూకాశ్మీర్ పహల్గాంలో మంగళవారం ఉగ్రవాదులు జరిపిన దాడిని ఖండిస్తూ, బాధిత కుటుంబాలకు సంఘీభావం తెలియజేస్తూ మండలంలోని ముస్లిం మైనారిటీలు మత గురువులు, పెద్దలు యువత శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ కన్వీనర్ అబ్దుల్ మాట్లాడుతూ దేశ చరిత్రలో ఇదొక బ్లాక్ డే అని ఇలాంటి దాడులు జరగకుండా దేశ ప్రధాని ఇటువంటి నిర్ణయాలు తీసుకున్న మైనార్టీలు పూర్తి మద్దతు ఇస్తారని ఆయన తెలిపారు. ఉగ్రదాడిని ఖండిస్తూ స్థానిక మసీదు ఆవరణంలో కొవ్వొత్తులు వెలిగించి మృతులకు నివాళులర్పించారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో మండల మైనార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్కేటర్స్ నిరసన..

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఆంధ్రప్రదేష్ రోలర్ స్కేటింగ్ అసోషియేషన్, చిత్తూరు, తిరుపతి జిల్లాల రూరల్ స్కేటింగ్ అసోషియేషన్ సంయుక్తంగా పహల్గాం ఉగ్రదాడిని వ్యతిరేకిస్తూ స్కేటర్స్‌తో నిరసన ర్యాలీ ఆదివారం ఉదయం నిర్వహించారు. ఈ ర్యాలీని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. ఎన్జీఓ కాలనీలోని ఎస్‌బిఐ నుంచి కపిలతీర్థం సర్కిల్ వరకు ఈ ర్యాలీ సాగింది. ర్యాలీ అనంతరం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ పర్యాటకులపై కాశ్మీర్‌లో ఉగ్రవాదులు దాడి చేసి హత్య చేయడం హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా రోలర్ స్కేటింగ్ అసోషియేషన్ కార్యదర్శి మంత్రి పురుషోత్తం, కోశాధికారి హనుమాన్ బాబ్జి, కోచ్ లు పిఎల్ ప్రసాద్, రాజేష్, శశికిరణ్, జనసేన నాయకులు లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కే వి బి పురం: కేవిబి పురం మండల కేంద్రంలోని జడ్.పి.హెచ్.ఎస్ ఉన్నత పాఠశాలలో ఆదివారం రష్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, పల్మనాలజీ, కిడ్నీ, గ్యాస్ట్రిక్ విభాగాల వైద్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్వో సుబ్రహ్మణ్యం, సుమతి, మీనా కుమారి పాల్గొన్నారు.

రైతులను ఆదుకోండి

ప్రజాశక్తి -కోట : గత ఎన్నో సంవత్సరాల నుండి భూములను అనుభవిస్తున్న రైతులను ఆదుకోవాలని,అదేవిధంగా స్థానిక గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ రైతులకు న్యాయం చేయాలని వైసిపి రాష్ట్ర నాయకులు పేర్నాటి శ్యాం ప్రసాద్ రెడ్డి కోరారు. ఆదివారం కొత్తపట్నం పంచాయతీలోని శ్రీనివాస సత్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి ఉప్పల ప్రసాద్ గౌడ్‌లు మాట్లాడుతూ ఇటీవల క్రిస్ సిటీ పరిశ్రమను ఏర్పాటు చేయడం అందరికీ తెలిసిందేనని, అందులోభాగంగా క్రిస్ సిటీ నిర్మాణానికి రైతుల భూములు కోల్పోవడం జరిగిందన్నారు. గతంలో కొత్తపట్నం పంచాయతీ పరిధిలోని భూములను పలువురు రైతులకు పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. కానీ కొత్తపట్నం గ్రామ రెవెన్యూ పరిధిలో రికార్డ్ తప్పులు తడకగా ఉన్నాయంటూ తాహసిల్దార్‌లు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మావద్ద పట్టాలు, పాస్ బుక్స్, ఆర్ ఓ ఆర్, టెన్ వన్ అడంగల్, డి రిజిస్టర్లు ఉన్నాగానీ అధికారులు అవన్నీ కరెక్ట్ కాదని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. రాజకీయాలకు తావు లేకుండా ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్ స్పందించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి ఉప్పల.ప్రసాద్ గౌడ్, సిద్దవరం సొసైటీ చైర్మన్ ఫాదర్తి.రాధాకృష్ణారెడ్డి, శ్రీ కనుపూరు ముత్యాలమ్మ దేవస్థానం మాజీ కమిటీ సభ్యులు దువ్వూరు.సాయి కృష్ణారెడ్డి, విన్నమాల వెంకటాద్రి, దువ్వూరు వెంకు రెడ్డి, దువ్వూరు శ్రీనివాసులు రెడ్డి, ఉప్పల ఆదినారాయణ పాల్గొన్నారు.

రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా రాధ

ప్రజాశక్తి తిరుపతి సిటీ : తిరుపతి రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాధను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.రాష్ట్ర వ్యాప్తంగా ముగ్గురు ప్రిన్సిపల్స్, ఐదుగురు సూపరింటెండెంట్లను బదిలీ చేయగా వారిలో తిరుపతి సూపరింటెండెంట్ ఉన్నారు. శ్రీవేంకటేశ్వర మెడికల్ కళాశాల అనస్థీషియా విభాగం ప్రొఫెసర్ రాధను రుయా నూతన సూపరింటెండెంట్‌గా నియమించారు. ఆమె త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు మండలంలో మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమేష్ బాబు తెలిపారు. ఈ సమావేశానికి నగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ హాజరుకానున్నట్లు తెలిపారు.అధికారులు సమావేశానికి హాజరై వారి అజెండాను చర్చించాలని కోరారు.

క్రైం న్యూస్

3 సవర్ల బంగారు నగ చోరీ



బీరువా చిందర వందర చేసిన దృశ్యం, విచారిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండో పట్టణ పరిధి, చింపిరి నాయుడు కాలువ కట్ట దగ్గర ఓ ఇంట్లో చోరీ జరిగింది. గూడూరు రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు కాలువ కట్ట దగ్గర నాగమణి అనే మహిళ నివసిస్తుందని తెలిపారు. ఆమె కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుందన్నారు. పనులు ముగించుకుని ఇంటికి వచ్చి చూడగా బీరువా పగల కొట్టి, 3 సవర్ల బంగారు నగలను అపహరించుకు పోయారన్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి గూడూరు డిఎస్పీ గీతా కుమారి, రెండో పట్టణ సిఐ శ్రీనివాస్ కలిసి పరిశీలించారు. అనంతరం క్లూస్ టీమ్ వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నామని తెలిపారు.

బంగారు నగల షాపులో చోరీ.. దొంగ అరెస్ట్



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : బంగారు షాప్‌లో పనిచేస్తూ చోరీకి పాల్పడిన దొంగను అదుపులోకి తీసుకున్నట్లు క్రైమ్ డిఎస్పి శ్యాంసుందర్ తెలిపారు. స్థానిక ట్రైన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక పోర్లవీధిలోని ఎస్ జె షాప్ ఓనర్ నటరాజన్ ఇంటిలో జరుగబోవు తన కొడుకు పెండ్లి పనులలో బిజీగా ఉండవలసి రావడంతో తన షాప్‌లో నమ్మకంగా పని చేస్తున్న వాళ్ళు మేఘ వర్మ (బన్నీ) అను యువకుడికి షాప్ నిర్వహణ, అమ్మకముల పనులు అప్పగించినాడు. 10 రోజుల క్రితం షాప్‌లో బంగారు, వెండి నగల అమ్మకము వివరములు, లెక్కలు చూడాలని చెప్పగా, అప్పటి వరకు పని చేస్తున్న మేఘ వర్మ తన సెల్ ఫోన్ ఆఫ్ చేసుకుని ఇంటిలోని వారికి కూడా చెప్పకుండా పరారీలో ఉన్నాడు. దీంతో షాప్ ఓనర్ నటరాజన్ షాప్‌లోని అమ్మకము వివరములు పరిశీలించాడు. షాప్‌లో సుమారు 268 గ్రాములు బంగారు నగలు, 356 గ్రాములు వెండి కనపడలేదని నిర్ధారించుని, క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేస్తూ షాప్‌లో పని చేస్తున్న వళ్ళు మేఘ వర్మపై అనుమానం వ్యక్తం చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ ప్రారంభించారు. తిరుపతి జిల్లా ఎస్పీ హర్ష వర్ధన్ రాజు ఆదేశాల మేరకు, తిరుపతి సిసిఎస్ అడిషనల్ ఎస్పీ నాగభూషణరావు పర్యవేక్షణలో, తిరుపతి సిసిఎస్ డిఎస్పీ శ్యామ్ సుందరం, ఇన్స్పెక్టర్లు యన్. శివ కుమార్ రెడ్డి, జి.ప్రకాష్ కుమార్, సబ్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్, సిసిఎస్ సిబ్బంది బృందాలుగా ఏర్పడి, అనుమానితుల గురించి విచారించి, వారి కదలికల పైన నిఘా పెట్టారు. షాప్‌లో పనిచేస్తున్న మేఘవర్మే చోరీకి పాల్పడినట్టు భావించి, 27వ తేదీ ఉదయం అలిపిరి చర్లోపల్లి రోడ్డులో ముద్దాయిని అరెస్టు చేసి, అతని నుండి మొత్తం 14 లక్షల విలువైన 271 గ్రాముల బంగారు, 356 గ్రాములు వెండి ఆభరణములు స్వాదినం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.

అటవీశాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతి నగరవనంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చేయూతగా మోహన్ బాబు యూనివర్సిటీ నుండి ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు నగరవనం పరిసరాలను శుభ్రం చేశారు. జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్ సూచనలతో తిరుపతి రేంజి ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లకు 100 మొక్కలను అధికారులు అందిందించారు. పర్యావరణం కోసం అటవీ శాఖ నిర్విరామ కృషి చేస్తుందని, ప్రతి ఒక్కరూ పర్యావరణానికి హాని కలిగించకుండా తమ వంతు బాధ్యతగా మొక్కలను పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు పనబాకం రేంజి ఆఫీసర్ మాధవి అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఒక్కరోజులో రూ. కోటి రాబడి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి వివిధ ఆర్జిత సేవల ద్వారా ఆదివారం ఒక్కరోజులోనే కోటి రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. అదేవిధంగా రికార్డు 8766 రాహు కేతు పూజలు జరిగినట్లు అధికారులు తెలిపారు. ఆలయ చరిత్రలో ఇదే అరుదైన రికార్డుగా వారు చెప్పారు.

రేపు గంగ జాతర చాటింపు

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడులో జూన్ 11, 12వ తేదీల్లో గంగజాతర నిర్వహణకు జాతర నిర్వాహకుల కమిటీ తుది నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం స్థానిక కళ్యాణ వీర భద్రస్వామి ఆలయ ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. సోమవారం తొలి చాటింపు, జూన్ 4వ తేదీన రెండో చాటింపు వేయనున్నట్లు తెలిపారు. జూన్ 11,12వ తేదీలలో బుధ, గురువారం 2 రోజులు పాటు గంగ జాతర నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో లాయర్ గోపీనాథ్, తదితరులు పాల్గొన్నారు.